

'మగువ'ను మట్టుబెడుతున్నారు..
జిల్లాలో ఇటీవల మహిళలపై దాడులు అధికమయ్యాయి. ఈవ్‌టీజింగ్, లైంగికదాడులతో పాటు వరకట్న వేధింపులకు యువతులు బలవుతున్నారు. 8లో▸



వానాకాలం.. రోగాలపై సమరం
వానాకాలం సీజన్ ఆరంభమైంది. వాతావరణ మార్పులతో వ్యాధులు ప్రబలే అవకాశముంది. ప్రతిఒక్కరూ ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

తైక్వాండో జిల్లా కార్యవర్గం



వేదవ్యాస్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఆదిలాబాద్: తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా వకుళాభరణం వేదవ్యాస్, చైర్మన్‌గా భీంసేన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మహేందర్, కోశాధికారిగా అశోక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వహాజుద్దీన్ మాట్లాడుతూ, జిల్లాలో తైక్వాండో అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలో త్వరలోనే రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

టీ9 టికెట్ సమయం పెంపు

ఆదిలాబాద్: ఆర్టీసీ బస్సుల్లో టీ9 టికెట్ సమయం పెంచినట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో తెలిపారు. పల్లె వెలుగు బస్సుల్లో ఈ టికెట్ ద్వారా ప్రయాణించే వారికి గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గడువు ఉండగా, దీన్ని రాత్రి 9 గంటల వరకు పొడిగిస్తూ సంస్థ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగేఎక్స్‌ప్రెస్‌లో సైతం ఈ టికెట్ వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆదిలాబాద్: బోనాలతో తరలివస్తూ..



ఆదిలాబాద్‌రూరల్: కేఆర్‌కే కాలనీలో..



బోథ్: సొనాలలో నైవేద్యాలు సమర్పిస్తూ..



తలమడుగు: సుంకిడిలో బోనాలతో తరలివస్తున్న గ్రామస్తులు



తలమడుగు: సుంకిడి ఆలయంలో పూజలు



తలమడుగు: బోనమెత్తుకున్న మహిళలు

బోనమెత్తి.. మొక్కుతీర్చి

జిల్లాలో ఆషాఢ బోనాల ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల నడమ గ్రామదేవతల ఆలయాలకు చేరుకున్నారు. జిల్లాకేంద్రంలోని గంజి పోచమ్మ ఆలయం, అశోక్‌రోడ్‌లోని పోచమ్మ, మహాలక్ష్మి ఆలయాలతో పాటు తలమడుగు మండలం సుంకిడిలోని పోచమ్మ ఆలయం భక్తులతో సందడిగా మారాయి. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లంగా చూడాలని వేడుకున్నారు. అలాగే బోథ్, తాంసి తదితర మండలాల్లోనూ బోనాల సందడి కనిపించింది.
–ఆదిలాబాద్/తలమడుగు/బోథ్/ఆదిలాబాద్‌రూరల్



ఆదిలాబాద్: మహాలక్ష్మీ ఆలయం వద్ద బారులుతీరిన భక్తులు



ఆదిలాబాద్: మహాలక్ష్మీ ఆలయంలోని అమ్మవార్ల విగ్రహాలు



ఆదిలాబాద్:అమ్మవార్లకు నైవేద్యం సమర్పిస్తూ..

నెత్తురోడుతున్న రహదారులు



మేకలగండి వద్ద రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అలాగే గతేడాది అక్టోబర్‌లో సీతాగోంది గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీఆర్ అధికారితో పాటు ఆయన కుటుంబానికి చెందిన మరో ఇద్దరు, డ్రైవర్ కూడా మరణించారు. పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబాల్లో తీరని శోకం నెలకొంది. జాతీయ రహదారిపై గల సీతాగోంది నుంచి గుడిహత్నూర్ వరకు గడిచిన ఆరు నెలల వ్యవధిలోరోడ్డు ప్రమాదానికి గురై ఎనిమిది మంది మృతి చెందారు. మరో 20 మంది వరకు క్షతగాత్రులయ్యారు.



ఈ ఆటో ఇచ్చోడ వైపు నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి దాదాపు 15 మంది ప్రయాణికులను పరిమితికి మించి తరలిస్తున్నారు. ఇదొక్కటే కాదు.. ప్రైవేట్ వాహనాల్లో చాలా వరకు ఇదే పరిస్థితి. శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆటోలో ముగ్గురు నుంచి నలుగురు ఉంటే పెద్ద మొత్తంలో ప్రాణనష్టం జరిగి ఉండేది కాదు. మిగతా వారు గాయాలపాలయ్యేవారు కాదని పలువురు పేర్కొంటున్నారు.

- ప్రాణాలు తీస్తున్న అతివేగం
- హైవేపై తరచూ ప్రమాదాలు
- ఘటన చోటుచేసుకున్నప్పుడే హడావుడి
- కుటుంబాల్లో నింపుతున్న విషాదం

జిల్లాలో మూడేళ్లుగా రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	రోడ్డు ప్రమాదాలు	మృతుల సంఖ్య
2021	245	145
2022	234	137
2023 (జూన్ వరకు)	140	62

ఆదిలాబాద్‌టౌన్: మితిమీరిన వేగం.. మద్యం మత్తు.. రహదారి నిబంధనలు పాటించకపోవడం.. తదితర కారణాలేమైనా తరచూ జాతీయ రహదారి 44పై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకచోట ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో రహదారులు నెత్తురోడుతుండగా, విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసు, రవాణ శాఖాధికారులు హడావుడి చేసి తర్వాత మరిచిపోతున్నారు. ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో యాక్సిడెంట్లు షరా మామూలుగా మారాయి. జాతీయ రహదారి కొన్ని ప్రాంతాల్లో ఏటవాలుగా ఉండటం, లారీలు అతివేగంగా రావడం, న్యూట్రల్ చేయడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిబంధనలు గాలికి..
చాలా మంది వాహనదారులు రహదారి నిబంధనలు పాటించడం లేదు. దీంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. రహదారి పైనే వాహనాలు నిలపడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, రాంగ్‌రూట్‌లో వాహనాలను తీసుకెళ్లడం, తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం, ఆటోలు, జీపులు, కార్లలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, తదితర కారణాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. భద్రత చర్యలు చేపట్టకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. రవాణ శాఖాధికారులు తనిఖీలు నామమాత్రంగా చేపట్టడంతోనే వాహనదారులు నిబంధనలను పాటించడం లేదనే ప్రచారం ఉంది. దీంతోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పోలీసు శాఖ అధికారులు తనిఖీలు చేపట్టినా నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధిస్తున్నారే తప్పా ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా.. తగ్గని ప్రమాదాలు
జిల్లాలో బ్లాక్‌స్పాట్‌లను గుర్తించినప్పటికీ రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా భోరజ్ చెక్‌పోస్టు, గుడిహత్నూర్ వద్ద గల సీతాగోంది ప్రాంతంలో ఇవి ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే తలమడుగు మండలం సుంకిడి, దేవాపూర్ చెక్‌పోస్టు, గుడిహత్నూర్ బస్టాండ్ ప్రాంతం, నేరడిగొండ, కుప్టి, బోథ్ ఎక్స్‌రోడ్, ఉట్నూర్ ఎక్స్‌రోడ్ ప్రాంతాల్లోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణ శాఖ అధికారులు మాత్రం రోడ్డు భద్రత విషయం తమ పరిధిలోకి రాదని చెబుతున్నారు. ఆర్అండ్‌బీ వారే పర్యవేక్షిస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే ఆర్అండ్‌బీ శాఖ మాత్రం దీనిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. జిల్లాలోని జాతీయ రహదారి 44నేరడిగొండ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ఉంది. ఈ ఫోర్‌లేన్‌పై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాలు రాత్రి వేళల్లో మితిమీరిన వేగంతో నడపడంతో చిన్న వాహనాలను ఢీకొడుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ అధికారులు బ్లాక్‌స్పాట్‌లు గుర్తించినా సరిచేయడం లేదు. సర్వీసు రోడ్లు, అక్కడక్కడ అండర్‌పాస్‌లు వంటివి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. లారీ, ఐచర్, తదితర భారీ వాహనాల డ్రైవర్లు డౌన్ వద్ద న్యూట్రల్ చేసి తీసుకెళ్లడంతో స్పీడ్ అదుపు చేయలేక వాహనాలను ఢీకొడుతున్నాయి.

వాహనాలు తనిఖీ చేస్తున్నాం



రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. నిబంధనలు పాటించని ఆటోలు, జీపులు, ఇతర వాహనాలకు జరిమానాలు విదించడంతో పాటు సీజ్ చేస్తున్నాం. అతివేగం, నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
– పుప్పాల శ్రీనివాస్, డీటీసీ

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాదాల నివారణ కోసం చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ సమక్షంలో త్వరలో హైవే అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఏ ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయో తెలుసుకొని వాటి నివారణ కోసం చర్యలు చేపడతాం. రాత్రివేళల్లో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నాం. పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ఆటోలు, జీపుల డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం.
– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

నిరుద్యోగుల్లో 'టెట్' ఆశలు

- త్వరలో నిర్వహించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం
- డీఈడీ, బీఈడీ అభ్యర్థుల సన్నద్ధం

ఆదిలాబాద్‌టౌన్: త్వరలోనే టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు శుక్రవారం మంత్రివర్గ ఉప సంఘం విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో విషయాన్ని ప్రకటించింది. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే టీచర్ రిక్రూట్‌మెంట్‌టెస్ట్ (టీఆర్టీ)రాసే అవకాశం ఉంటుంది. గతేడాది జూన్ 12న విద్యాశాఖ టెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే గత పరీక్షలో చాలామంది డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ రాసినా అర్హత సాధించలేకపోయారు. మరోసారి టెట్ నిర్వహిస్తే వీరికి మేలు జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ నిర్ణయంపై నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం ఇటీవల గ్రూప్–1, గ్రూప్–4, పోలీసు, ఇతర పోటీ పరీక్షలను నిర్వహించింది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ సైతం చేపడితే మరికొంత మంది నిరుద్యోగులకు మేలు జరిగే అవకాశం ఉంది. అలాగే సర్కారు పాఠశాలల విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యాబోధన అందనుంది.

గతేడాది..
గతేడాది నిర్వహించిన టెట్ పేపర్–1లో 7,732 మంది దరఖాస్తు చేసుకోగా, 7,566 పరీక్ష రాశారు. 2,525 మంది అర్హత సాధించగా 33.37 శాతంగా నమోదైంది. ఇక పేపర్–2లో 3,167 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 3,062 మంది పరీక్షకు హాజరయ్యారు. 1580 మంది (51.60 శాతం) అర్హత సాధించారు. ఇప్పటికే వేలాది మంది బీఎడ్, డీఎడ్ పూర్తి చేసి టీఆర్టీ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. చివరగా 2017లో ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు నియామకాలు చేపట్టలేదు. జిల్లాలో 574 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు బోధన కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆదివాసీ సంస్కృతికి పండుగలు ప్రతీక

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



పూజల్లో పాల్గొన్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించేలా పండుగలు నిర్వహించుకోవడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్ ప్రాంగణంలో భీమన్న పండుగను ఆదివాసీలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నాయక్‌పోడుల ఆరాధ్య దైవమైన చిలుకలయ్య, భీమయ్య దేవతలకు నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సకాలంలో వర్షాలు పడి పంటలు పండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సట్ల అశోక్, రాజయ్య, శంకర్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నాయక్‌పోడ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైడూర్యపురంలో పెద్ద పండుగ



మండలంలోని వైడూర్యపురం(వడూర్)లో గ్రామస్తులు పెద్ద పండుగను నాలుగు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామ దిగ్బంధం కార్యక్రమం చేపట్టారు. అమ్మవారి ప్రతిమతో శోభాయాత్ర చేపట్టారు. ప్రత్యేక పూజలు, భక్తుల పూనకాలు ఆకర్షణగా నిలిచాయి. పండుగ సోమవారం వరకు కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు.
– నేరడిగొండ

క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలి

- డీఈవో ప్రణీత

నేరడిగొండ: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందించాలని డీఈవో ప్రణీత అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని ఆదివారం ఆమె సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. మెనూ అమలు తీరును విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడడంతోపాటు మెనూ తప్పనిసరి అమలు చేయాలన్నారు. సెలవు దినం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను చూసేందుకు పాఠశాలకు రాగా వారితో కాసేపు మాట్లాడారు. ఆమె వెంట జీసీడీవో ఉదయశ్రీ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత



క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో కూలీగా పనిచేస్తున్న చింతల కపిల్ (35) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. ఇలా అయితే ఇద్దరు కూతుళ్ల భవిష్యత్ ఏంటని భార్య కృష్ణ వేణి మందలించింది. శనివారం ఉదయం ఇంటి నుంచి పనికోసం బయల్దేరి వెళ్లిన కపిల్ రాత్రి వరకు తిరిగి రాలేదు. భార్య చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసింది. కాగా, కేఆర్‌కే కాలనీలో పురుగుల మందు తాగి కపిల్ మృతిచెందిన విషయాన్ని స్థానికులు ఆదివారం కుటుంబీకులకు తెలియజేశారు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

కుంటాల: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మండలంలోని కుంటాల–అంబకంటి రోడ్డు మార్గంలో ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా, ముగ్గురు మద్యం తాగినట్లు రుజువైంది. ఏఎస్సై రాందాస్ తదితరులు ఉన్నారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి బైక్ చోరీకి గురైనట్లు టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 2న జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో హోంగార్డు ఆకుల వెంకటరమణ బైక్‌ను పార్క్‌చేసి తన స్నేహితుడిని బస్సు ఎక్కించాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెతికినా దొరకలేదు. ఆదివారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సిద్ధప్ప రచనలు సమాజానికి అందించాలి



మాట్లాడుతున్న సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: వరకవి సిద్ధప్ప రచనలను నేటి సమాజానికి అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని కుమ్మరి జాగృతి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్ అన్నారు. వరకవి సిద్ధప్ప జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మోల్లమాంబ విగ్రహం వద్ద ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వ్యవస్థ, మూఢనమ్మకాలు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి సిద్ధప్ప అని పలువురు కొనియాడారు. 40కి పైగా గ్రంథాలు, సీస పద్యాలు రాసిన సిద్ధప్ప గొల్కొండ కవుల సంచికలో 105వ కవిగా ప్రసిద్ధి చెందారన్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, ప్రధాన కార్యదర్శి రాజారపు శ్రీనివాస్, కవి, రచయిత పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివాజీగౌడ్



నిర్మల్‌టౌన్: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లా కేంద్రానికి చెందిన పొన్నం శివాజీగౌడ్ నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నగౌడ్ ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం, విద్యార్థి నాయకులు, తోటి మిత్రులు శివాజీగౌడ్‌కు అభినందనలు తెలిపారు. బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని శివాజీగౌడ్ పేర్కొన్నారు.

కిలో చికెన్ రూ.100



చికెన్ సెంటర్ల వద్ద గుమిగూడిన ప్రజలు

నేరడిగొండ: చికెన్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. జనాలు పప్పుతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం చికెన్ కిలో ధర రూ.200లకు పైచిలుకు ఉంది. అయితే నేరడిగొండలో వ్యాపారుల మధ్య పోటీ వినియోగదారులకు నాన్‌వెజ్ తినేలా చేస్తోంది. మండల కేంద్రంలోని ఇద్దరు వ్యాపారులు ఆదివారం ఒకరికి పోటీగా ఒకరు రూ.100లకే కేజీ చికెన్ విక్రయించారు. గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి చేరుకుని దుకాణాల వద్ద బారులు తీరి మరీ కొనుగోలు చేశారు.

మగువను మట్టుబెడుతున్నారు..!

- వరకట్న వేధింపులకు బలి
- భార్యాభర్తల మధ్య మనస్పర్థలు
- కూలుతున్న కాపురాలు
- కలహాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం
- ఆత్మహత్య, హత్యలకు దారితీస్తున్న వైనం



- బోథ్‌కు చెందిన ఓ యువతిని ఇదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. వీరి కులాలు వేరు కావడంతో ఇంట్లోంచి వెళ్లిపోయి పెళ్లి చేసుకున్నారు. నిర్మల్‌లో కాపురం పెట్టారు. రెండేళ్లు తిరిగేసరికి ఓ పాప జన్మించింది. కొన్నిరోజుల తర్వాత కట్నం తేవాలంటూ భర్త వేధించగా భార్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్తే చంపి ఉంటాడని కుటుంబీకులు ఆరోపించారు.

- బోథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని నేరడిగొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన అబ్బాయికిచ్చి పెళ్లి చేశారు. కట్నంగా రూ.20 లక్షలు ఇచ్చారు. పెళ్లయిన ఏడాదికి అదనపు కట్నం కావాలని అత్తింటివారు వేధించారు. యువతి తల్లిదండ్రులు మరో రూ.6 లక్షలు, నిర్మల్‌లోని ఓ ప్లాటు ఇచ్చారు. ఏం జరిగిందో తెలియదు.. యువతి ఆత్మహత్యకు పాలఏడింది. భర్త వేధింపులే తమ కుమార్తె మృతికి కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు.

జిల్లాలో నమోదైన కేసులు.. లైంగికదాడులు : 29 ఈవ్‌టీజింగ్ : 74 వరకట్న వేధింపులు : 132 పోక్సో కేసులు : 11

బోథ్: జిల్లాలో ఇటీవల కాలంలో మహిళలపై వేధింపులు ఎక్కువయ్యాయి. ఈవ్‌టీజింగ్, లైంగికదాడులు, వరకట్న వేధింపులకు యువతులు, అబలలు ప్రాణాలు తీసుకుంటున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలకు కాపురాలు కూలుతున్నాయి. పిల్లలు అనాథలుగా మారుతున్నారు. చిన్నచిన్న కలహాలకు కుటుంబాలు ఛిన్నాభిన్నామవుతున్నాయి. మరోవైపు అదనపు కట్నం కోసం భర్త, అత్తింటివారు వేధింపులకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెళ్లి సమయంలో అడిగినంత కట్నకానుకలు ఇచ్చినా మరింత కావాలని వేధిస్తున్నారు. కూతురు కోసం తల్లిదండ్రులు నగదు, ప్లాట్లు ఇచ్చేస్తున్నారు. అయినా వారిపై అఘాయిత్యాలు ఆగడం లేదు. ఇంకొన్ని చోట్ల హత్య చేసి తమకేమి తెలియదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు.

పరిష్కారమే మార్గం

ఏవైనా ఇబ్బందులు తలెత్తినపుడు సమన్వయంతో పరిష్కరించుకుంటేనే గొడవలు సద్దుమణుగుతాయి. కోపాలు తగ్గించుకోవడం, గొడవ సద్దుమణిగేలా పొరపాటు జరిగిందని, క్షమించమని కోరితే అక్కడితో ఆగిపోతుందని తెలుసుకోవాలి. కుటుంబంలో ఇబ్బందులు ఎదురైతే ఇద్దరూ కలిసి చర్చించుంటే కాపురం నిలబడుతుంది.

గృహహింస నిరోధక చట్టం(2006)..

మహిళలను శారీరకంగా హింసించడం, గాయపర్చడం, ప్రాణాలకు హాని తలపెట్టడం, మాటలతో మానసికంగా ఒత్తిడి పెంచడం, తదితర ఇబ్బందులకు గురిచేస్తే గృహహింస అవుతుంది. ఇలాంటి సమయంలో బాధిత మహిళ నేరుగా మేజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉచిత న్యాయసేవలు

కుటుంబాల్లో కలహాలు, వివాదాలు పరిష్కరించుకునేందుకు ఉచిత న్యాయసేవలు పొందవచ్చు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయసేవలు పొందే అవకాశం కల్పిస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా జిల్లాల్లో సఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వారితో మాట్లాడితే సలహాలు, సూచనలు ఇస్తారు. భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తారు. గృహహింసకు పాల్పడితే శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు.

చిన్నచిన్న కలహాలే..

పని ఒత్తిడిలో భాగస్వామితో సమయం కేటాయించకపోవడం.. తమను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావనతో గొడవలు జరుగుతున్నాయి. చిన్నచిన్న కలహాలే దంపతుల మధ్య గొడవలకు దారితీస్తున్నాయి. దీంతో కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. వ్యాపారాల్లో నష్టాలు, అనుకోని సంఘటనలతో అప్పుల పాలవడం..వాటిని తీర్చేమార్గం లేక ఇంట్లో గొడవలకు కారణమవుతున్నాయి. సామాజిక మాధ్యమాలు, ఇతర పరిచయాలతో వివాహేతర సంబంధాలకు దారితీయడంతో కుటుంబంలో చిచ్చుపెడుతున్నాయి. ఫోన్‌లో మాట్లాడినా, ఇతరులతో మాట్లాడుతున్నా భార్య లేదా భర్తపై అనుమానాలు పెంచుకోవడంతో హత్యల వరకు వెళ్తున్నాయి.

సమస్యలుంటే వీరిని సంప్రదించవచ్చు:

వుమెన్ హెల్ప్‌లైన్ సెంటర్ : 181,
పోలీసుల హెల్ప్‌లైన్ సెంటర్: 100

మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి



సమస్య ఏదైనా పరిష్కార మార్గాలున్నా.. ఆ దిశగా ఆలోచించడం లేదు. సహనం కోల్పోయి విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నారు. మద్యానికి అలవాటు పడి ఏం చేస్తున్నారో తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. సమస్యలు ఎదురైనప్పుడు మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. నేర సంబంధిత సంఘటనలను సమాచార మాధ్యమాల్లో పదే పదే చూడటంతోనూ మానసిక స్థితిపై ప్రభావం చూపుతుంది.

– డాక్టర్ ఓంప్రకాశ్, మానసిక వైద్యనిపుణుడు

నాణ్యతకు తిలోదకాలు

- నాసిరకంగా సదర్మాట్ గైడ్‌వాల్ పనులు
- కొరవడిన పర్యవేక్షణ
- పట్టించుకోని అధికారులు



నాణ్యతాలోపంతో చేపట్టిన పనులు



నాసిరకం పనులు చూపిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారమైన మండలంలోని మేడంపల్లిలో గల చేపట్టిన సదర్మాట్ గైడ్‌వాల్ పనుల్లో నాణ్యత లోపిస్తోంది. ఉన్నతాధికారులు పనులను పర్యవేక్షించనందునే పనులు నామమాత్రంగా చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గైడ్‌వాల్ మరమ్మతుకు ప్రభుత్వం 2016లో రూ.కోటి 20 లక్షలు నిధులు మంజూరు చేసింది. అనివార్య కారణాల వల్ల అధికారులు ఇప్పటికి పనులు చేపట్టలేదు. గత రెండునెలల క్రితం గైడ్‌వాల్ దెబ్బతిని గోదావరిలోకి నీరు వృథాగా పోతోంది. దిగువకు నీరు రావడం లేదని రైతులు తరలివచ్చి పలుమార్లు ఆందోళన చేపట్టారు. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించారు.

తూతూమంత్రంగా పనులు

దెబ్బతిన్న సదర్మాట్ గైడ్‌వాల్‌తోపాటు దెబ్బతినని చోట అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. స్వల్ప లీకేజీలు ఉన్నచోట మూడు ఇంచుల మేర గైడ్‌వాల్‌కు సిమెంట్‌తో పూత చేస్తున్నారు. నాసిరకం పనులు చేపట్టడంపై పలువురు రైతులు, పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. సిమెంట్ పూత బదులు ఫీటున్నర గోడ కట్టి ఉంటే ఎంతో ఉపయోగకరంగా ఉండేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చేపట్టిన పనులు నాసిరకంగా ఉండడంతో దెబ్బతినే అవకాశం ఉంది. కాగా, పనిచేసిన ప్రాంతంలో అక్కడికి వెళ్లేందుకు మట్టితో తాత్కాలికంగా రోడ్డు వేశారు. దాన్ని తొలగించకపోవడంతో ఆయకట్టు దిగువకు సాగునీరు ఎలా వెళ్తుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పలు పైపులు తీయకుండానే వదిలేశారు. గతంలో షెటర్ల ముందు నిలిచిన మట్టితో చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదని రైతులు ఆందోళన చేశారు. అధికారులు తొలగించి దాన్ని సరిచేశారు. తాజాగా సదర్మాట్‌లో వదిలేసిన మట్టిని షెటర్ల ముందు నిలువనుంది. ఓ వైపు ఆయకట్టులోని వానాకాలం సాగుకు నీటి విడుదలకు సమయం సమీపిస్తుండడంతో పనులు ఎప్పుడు పూర్తిచేస్తారోననే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా నా పనుల్లో లోపించిన నాణ్యతపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పొన్కల్ వద్ద బ్యారేజీ పనులు

2008లో ఖానాపూర్‌కు వచ్చిన దివంగత సీఎం వైఎస్సార్ సదర్మాట్‌ను సందర్శించి రూ.305 కోట్లు మంజూరు చేశారు. ఆయన అకాల మరణంతో అంచనా వేసి సుమారు రూ.500 కోట్లతో సదర్మాట్ ఎగువన 7 కి.మీ దూరంలోని నిర్మల్ నియోజకవర్గంలోని మామడ మండలం పొన్కల్‌కు తరలించారు. ప్రస్తుతం పొన్కల్ వద్ద బ్యారేజీ పనులు కొనసాగుతున్నాయి.

పనులు నాణ్యతతోనే చేపడుతున్నాం

2016లో రూ.కోటి 20 లక్షల నిధులు మంజూరయ్యాయి. జీఎస్టీతో కలిపి రూ.కోటి 50 లక్షలు అయింది. ఆ నిధుల నుంచి రూ.45లక్షల మేర గైడ్‌వాల్ మరమ్మతు పనులు చేపట్టాం. సమయం తక్కువగా ఉండడం వల్ల యాసంగి సాగు అనంతరం పనులు చేపట్టాం. పనులు పూర్తి నాణ్యతతో చేపడుతున్నాం. ప్రస్తుతం అందులో ఉన్న మట్టిని తొలగించలేదు. వర్షపు నీటితో అది కొట్టుకుపోతుంది. పలు పైపులను తీసే పరిస్థితి లేక అందులోనే వదిలేశాం. రైతులు ఆందోళన చెందొద్దు.

– నవీన్, జేఈఈ

ఇష్టారాజ్యంగా పనులు



సదర్మాట్ ఆనకట్ట వద్ద చేపట్టిన పనులు పూర్తిగా నాసిరకంగా చేస్తున్నారు. లక్షలాది రూపాయల నిధులు వృథా అవుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. పనులు చేసే సమయంలో వేసిన వందలాది ట్రిప్పుల మట్టితో పాటు పలు పైపులను తొలగించకుండా అందులోనే వదిలేశారు.

– గుగ్లావత్ రాజునాయక్, సర్పంచ్, మేడంపల్లి

యువ గాయని... సుమలత

- గోండు, ఫోక్ సాంగ్స్‌తో అలరిస్తున్న వైనం
- ప్రతిభకు దక్కిన క్రాంతి జ్యోతి ఎక్సలెన్స్ అవార్డు
- ఆదర్శంగా నిలుస్తున్న నిరుపేద యువతి..



క్రాంతి జ్యోతి ఎక్సలెన్స్ అవార్డు



అవార్డు అందుకున్న కోడప సుమలత

ఇంద్రవెల్లి: ఆదివాసీ గిరిజన తెగకు చెందిన నిరుపేద యువతి కోడప సుమలత కళ రంగంలో తనదైన శైలిలో రాణిస్తోంది. గోండు, జానపద, ఫోక్‌సాంగ్స్ పాడుతూ ప్రజల మన్ననలు పొందుతోంది. సుమలత ప్రతిభను గుర్తించిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్‌నేషనల్ 2023లో భాగంగా క్రాంతి జ్యోతి మహిళా సాధికారత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25న హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఎం.ఎస్.రావు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రాంతిజ్యోతి ఎక్సలెన్స్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందజేసింది.

తల్లిదండ్రులే గురువులు...

మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన కోడప రామరావ్, పంచుబాయి దంపతులది నిరుపేద కుటుంబం. తల్లిదండ్రులు మొదటి నుంచే వితల రుక్మాయి, పులాజీబాబా భక్తులు. గ్రామంతో పాటు ఏ గ్రామంలోనైనా భజన కార్యక్రమాలు ఉంటూ వీరు వెళ్లేవారు. కోడప సుమలత, తమ్ముడు కోడప సాయికుమార్‌లు చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులతో కలిసి భజన కార్యక్రమాలకు వెళ్లి ఆధ్యాత్మిక పాటలు పాడేవారు. అదే సమయంలోనే పెళ్లి వేడుకలతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొని సంప్రదాయ నృత్యాలు చేయడం, పాటలు పాడటంలో పట్టుసాధించారు. అలా పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ గోండు గాయనిగా రాణిస్తున్న కోడప సుమలత కళ ప్రతిభను గుర్తించిన నిర్మల్‌కు చెందిన శ్రీకాంత్ తన ఆర్కెస్ట్రాలో చేర్పించి పాటలు ఎలా పాడాలో... శిక్షణ ఇచ్చి గోండి సాంగ్స్‌తో పాటు జానపద, ఫోక్స్ పాటలు నేర్పించడంతో గోండు గాయనిగా గుర్తింపు వచ్చింది.

కోడప సుమలతకు ఎక్సలెన్స్ అవార్డు...

గోండ్‌గాయనిగా రాణిస్తూ... కళ రంగంలో ముందడుగు వేస్తున్న కోడప సుమలత సేవలను గుర్తించిన క్రాంతి జ్యోతి మహిళా సాధికారత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు... వారి కళను... వారి సేవలను ప్రోత్సహించేందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్‌నేషనల్ 2023లో భాగంగా జూన్ 25న హన్మకొండ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవార్డు పంపిణీ కార్యక్రమంలో కోడప సుమలత క్రాంతిజ్యోతి ఎక్సలెన్స్ అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకుని ప్రజల మన్ననలు పొంది ఆదర్శంగా నిలుస్తోంది.

సారంగదరియాలో రెండో విజేతగా..

కోడప సుమలత నిర్మల్‌కు చెందిన శ్రీకాంత్ తన ఆర్కెస్ట్రా కళ బృందం ఆధ్వర్యంలో 2022లో వనిత టీవీలో నిర్వహించిన సారంగదరియా కార్యక్రమంలో పాల్గొని తనదైన శైలిలో గోండి, జానపద పాటలు పాడి రెండో విన్నర్‌గా ప్రతిభ కనబరిచి ప్రజాగాయకుడు గద్దర్, సినిమా డైరెక్టర్ చేతుల మీదుగా రెండో విన్నర్‌గా ప్రశంసా పత్రం అందుకుంది. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం జూన్ 2 నుంచి 22 వరకు నిర్వహించిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిప్రి గ్రామంలో నిర్వహించిన వివిధ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని గుర్తింపు సాధించడంతో కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంది.

చాలా సంతోషంగా ఉంది

క్రాంతిజ్యోతి మహిళా సాధికారత స్వచ్ఛంద సేవా సంస్థ వారు నా కళ, నా సేవలను గుర్తించి క్రాంతి జ్యోతి ఎక్సలెన్స్ అవార్డు అందించడం సంతోషంగా ఉంది. ఎక్సలెన్స్ అవార్డు రావడానికి ఆర్కెస్ట్రా నిర్వాహకులు శ్రీకాంత్, అన్ని విధాలుగా సహకరించిన నా కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటా. ఇక ముందు కూడా గోండ్ గాయనిగా రాణిస్తూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంతో పాటు నా కళ రూపంలో ఆదివాసీ సమాజం చైతన్యం కోసం నా వంతు కృషి చేస్తా.

– కోడప సుమలత, (గోండ్ గాయని)

మట్టితో ప్రతిమ తయారు చేసి.. ప్రతిభ చాటి..



మూలవిరాట్ ప్రతిమ



ఆలయకమిటీ సభ్యులకు ప్రతిమ అందజేస్తున్న భీమేశ్, కుటుంబ సభ్యులు

- ప్రముఖ కళాకారుడు పోలీస్ భీమేశ్
- బోనాల రోజే ఆలయంలో అందజేత

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి తొలి మూలవిరాట్ విగ్రహాన్ని పోలిన ప్రతిమను బంకమట్టితో తయారు చేసి ప్రతిభ చాటాడు ప్రముఖ కళాకారుడు పోలీస్ భీమేశ్. బోనాల పండగ రోజైన ఆదివారం ఆ విగ్రహాన్ని తన కుటుంబసభ్యులతో కలిసి వచ్చి ఆలయంలో ఆలయ చైర్మన్ గంగాధర్, సభ్యుల సమక్షంలో అందజేశారు. నిర్మల్ రూరల్ మండలం అనంతపేటకు చెందిన భీమేశ్ ఇప్పటికే బంకమట్టి, పర్యావరణహిత నీటిరంగులు వాడి పలు విగ్రహాలను తయారు చేశారు. ఆలయకమిటీ సభ్యుల కోరిక మేరకు విగ్రహాన్ని తయారు చేసినట్లు భీమేశ్ తెలిపారు. అందమైన ఆకృతిలో అమ్మవారి మూలవిరాట్ ప్రతిమను రూపొందించిన భీమేశ్‌ను ఆలయకమిటీ సభ్యులు అభినందించారు.

డాక్టర్ తీరు మారలే..?

- జిల్లా వైద్యాధికారికి స్టాఫ్‌నర్సు ఫిర్యాదు

నేరడిగొండ: విధులు సక్రమంగా చేపట్టకుండా ఇదివరకే ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ డాక్టర్ తీరు ఇంకా మారలేదు. గత బుధవారం పీహెచ్‌సీకి చెందిన ఓ స్టాఫ్‌నర్సు జిల్లా వైద్యాధికారికి ఆయనపై ఫిర్యాదు చేసినట్టు తెలుస్తోంది. అయితే సదరు డాక్టర్ ఆమెపై దురుసుగా ప్రవర్తించినందుకే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ఆమెకు తెలిపినట్లు సమాచారం. కాగా సదరు వైద్యుడు విధులకు డుమ్మా కొట్టినప్పటికీ రిజిస్టర్‌లో మాత్రం హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదైన పని నిమిత్తం సెలవు అడిగితే మంజూరు చేయడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇలాంటి సంఘటలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను వైద్యసిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

‘అడెల్లి’లో కోరుట్ల ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు చందు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ అమ్మవారిని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సతీసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యేను సత్కరించారు. అమ్మవారికి ఆషాఢం బోనాలు సమర్పించిన ప్యారమూర్ గ్రామానికి చెందిన శివసత్తుల బృందం సభ్యులను సన్మానించారు. ఆలయ ఈవో రవికిషన్, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ సభ్యురాలు దేవాయి ఉన్నారు.

పొలాల్లో జింకల పరుగులు



ముధోల్: మండల కేంద్రంతోపాటు విఠోలి, ఆష్టా గ్రామాల్లోని చేన్లలో రైతులు ఇటీవల పత్తి సోయా, మొక్కజొన్న, పెసర, మినుముల విత్తనాలు విత్తారు. వర్షాలు కురిస్తే మొలకెత్తుతాయోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం పొలాల్లో జింకలు పరుగులు పెడుతూ మొలకలను తింటూ నష్టం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 34 ఏళ్ల తర్వాత వీరి ఆత్మీయ సమ్మేళనానికి పాఠశాల వేదికైంది. ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుల నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. ఉపాధ్యాయులు మల్లారెడ్డి, దేవారెడ్డి, సత్తయ్య, మురళీగౌడ్, దేవాగౌడ్, కిశోర్‌కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



కడెం: వీకెండ్ సెలవులు రావడంతో ఆదివారం కడెంలో పర్యాటకులు సందడి చేశారు. ప్రాజెక్ట్ పరిసరా ప్రాంత అందాలను తిలకించారు. బోటు షికారు చేస్తూ ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు.

బోటింగ్ చేస్తున్న పర్యాటకులు